క్లుప్తంగా

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి


పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నియాజ్

సుల్తానాబాద్: పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్ ఆదేశించారు. పట్టణంలోని పలు కాలనీల్లో డ్రైనేజీ పూడికతీత పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణం పరిశుభ్రంగా ఉండేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. వీధిలోకి వచ్చిన మున్సిపల్ వాహనానికి తడి, పొడి చెత్తను వేరుచేసి అందించి సహకరించాలన్నారు. డ్రైనేజీలు, రోడ్లపై చెత్త వేయొద్దని ఇంటి యజమానులకు సూచించారు. ప్రతీ ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేస్తామని, విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. అశోక్‌నగర్ సమీపంలోని నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. శానిటరీ సూపర్‌వైజర్ న్యాతరి రాజ్‌కుమార్, మహేశ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి


అభినందిస్తున్న సీఐ సుబ్బారెడ్డి

సుల్తానాబాద్‌రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదివినప్పుడే ఉన్నతస్థాయికి చేరుకుంటారని సీఐ సుబ్బారెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలం భూపతిపూర్‌లోని మహాత్మాజ్యోతిబాపులే బాలుర గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో మంచి ప్రతిభ కనబరిచారు. సుల్తానాబాద్ సీఐ కార్యాలయంలో బుధవారం విద్యార్థులను సీఐ, ప్రిన్సిపాల్ రాజేశం అభినందించారు. పాఠశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న రవితేజ (93.48), సిద్దార్థ (88.84), చరణ్(84.48) ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ తెలిపారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదిగారన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ


మాట్లాడుతున్న ఎస్సై దికొండ రమేశ్

ఓదెల: గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ జరుగుతుందని పొత్కపల్లి ఎస్సై దికొండ రమేశ్ అన్నారు. మండలంలోని శానగొండ గ్రామంలో బుధవారం సీసీ కెమెరాల ఏర్పాటు, సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి దొంగతనాలు జరిగినా, సైబర్ నేరాలు జరిగినా వెంటనే సీసీ కెమెరాలతో నియంత్రించ వచ్చన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు తిరిగితే వెంటనే సమాచారం అందించాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు ఎవరైనా అమ్మితే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. వీపీవో, గ్రామస్తులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు నాయకుల ముందస్తు అరెస్టు

జూలపల్లి: బీసీ కులగణనలో మున్నూరుకాపులకు అన్యాయం జరిగిందని రాష్ట్ర సంఘం పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడికి వెళ్తారన్న సమాచారంతో మండల కేంద్రంతో పాటు అబ్బాపూర్ మున్నూరుకాపు సంఘం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి ఠాణాలో ఉంచారు. అనంతరం సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు. అరెస్టయిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేశ్, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు దండె వెంకటేశం, నాయకులు గుమ్మడి శంకరయ్య, నాడెం శ్రీధర్, బండి రాజయ్య, పసునూటి శ్రీనివాస్, ప్రసాద్, హరీశ్ ఉన్నారు.

నేడు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

జూలపల్లి: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ–2025 ఎన్నికల ఓటరు పోలింగ్ స్టేషన్ల డ్రాఫ్టు జాబితాను 11న విడుదల చేశారు. దీనిపై అన్ని రాజకీయ పార్టీల మండల స్థాయి అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పద్మజ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాయలంలో నిర్వహించే సమావేశానికి నాయకులు వచ్చి ఎన్నికల పోలింగ్ స్టేషన్లపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. ఉదయం 11.30 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

చెత్తరహిత పట్టణంగా తీర్చిదిద్దుతాం

• పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్


రోడ్డును శుభ్రం చేస్తున్న కమిషనర్ ఆకుల వెంకటేశ్, సిబ్బంది

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిని చెత్త, ప్లాస్టిక్‌రహిత పట్టణంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ 2024–25 కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని మినీ ట్యాంకుబండ్ (ఎల్లమ్మ గుండమ్మచెరువు)పై మున్సిపల్ సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. ఇంట్లోనే తడి, పొడి చెత్తగా వేరుచేసి మున్సిపల్ స్వచ్ఛ ఆటోలకు అందజేయాలన్నారు. మినీ ట్యాంకుబండ్ సందర్శకులు సాయంత్రం ఇంట్లో నుంచి తీసుకువచ్చే పూజ సామగ్రి, ప్లాస్టిక్ కవర్లను చెరువులో వేయొద్దని సూచించారు. ట్యాంకుబండ్‌పై ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ డస్ట్‌బిన్లను ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ రమాకాంత్, వార్డు ఆఫీసర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద ప్రత్యేక పూజలు


ఓదెల: కొలనూర్ సమ్మక్క గద్దెల వద్ద భక్తుల పూజలు


కమాన్‌పూర్: పేంచికల్‌పేటలో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ధర్మారం: మండల కేంద్రంలోని సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద మినీ జాతరకు జాతర కమిటీ ఏర్పాట్లు చేసింది. మినీ జాతరకు వచ్చే భక్తులకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు దేవి జనార్దన్ తెలిపారు. చిరంజీవి, తిరుపతి, లక్ష్మీరాజం, రాము పాల్గొన్నారు.

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్ గ్రామంలోని పోచమ్మ గుట్టపై వెలసిన శ్రీసమ్మక్క–సారలమ్మకు జాతర కమిటీ సభ్యులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. కోయ పూజారి ఆంజనేయులు అమ్మవార్లకు బోనం సమర్పించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వనదేవతలకు జాతర కమిటీ అధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పసునూటి శ్రీనివాస్, సభ్యులు జంగిలి లచ్చయ్య, మల్లయ్య, గాండ్ల చంద్రయ్య, ధర్మయ్య, బొడిగె లక్ష్మీనారాయణ, లక్ష్మీపతి, రాయనర్సు పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మండలంలోని గుండారం, పెంచికల్‌పేట గ్రామాల్లో సమ్మక్క–సారలమ్మకు బుధవారం జాతర కమిటీ సభ్యులు కోయ పూజారులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవార్లకు మొక్కులు చెల్లించారు.

ఓదెల: మండలంలోని కొలనూర్ గ్రామంలోని అల్లిమాసాని చెరువుగట్టు సమీపంలోని సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద గ్రామస్తులు, భక్తులు బుధవారం పూజలు చేశారు. ఉప్పరపల్లె, ఓదెల, పెగడపల్లి, హరిపురం, గోపరపల్లె, కనగర్తి, పిట్టలపల్లెకు


ధర్మారం: పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు

చెందిన గ్రామస్తులు తరలివచ్చారు. గద్దెలవద్ద మొక్కులు చెల్లించారు. కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, మాజీ సర్పంచు ఢిల్లీ శంకర్, మాజీ ఎంపీటీసీ దొడ్డె శంకర్, నాయకులు రేగుల తిరుపతి, సాత్తూరి రవి, శంకరయ్య, సాత్తూరి రాజేశం పాల్గొన్నారు.

తప్పుల తడకగా కులగణన సర్వే


మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని: కులగణన సర్వే అంతా తప్పుల తడక అని, కాంగ్రెస్ అంటేనే మోసాలకు కేరాఫ్ అని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ విమర్శించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల సర్వే తిరిగి నిర్వహించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 14న నిర్వహించే బీసీ రౌండ్ టేబుల్ సమావేశానికి అందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. సర్వే పేరుతో బీసీల జనాభా శాతం తగ్గించి ఓసీల జనాభా పెంచారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేను ఆ పార్టీకి సంబంధించిన నేతలే తప్పుపడుతున్నారని, అయినా కాంగ్రెస్ ప్రభుత్వంలో మార్పు రావడం లేదని ఎద్దేవా చేశారు. సమావేశంలో నాయకులు గోపు ఐలయ్య యాదవ్, బొడ్డు రవీందర్, బొడ్డుపల్లి శ్రీనివాస్, నూతి తిరుపతి, అచ్చ వేణు, కల్వచర్ల కృష్ణవేణి, సట్టు శ్రీనివాస్, అల్లం అయిలయ్య, సంధ్యారెడ్డి, కోడి రామకృష్ణ, వెంకన్న, కిరణ్‌జీ, సారయ్య నాయక్, వెంకటేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఓబీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

రామగిరి: ఆర్జీ–3 పరిధి ఓసీపీ–2లో ఓబీ పనులు నిర్వహించే ప్రైవేట్ కంపెనీ డ్రైవర్ దేగ నరేశ్ ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికుల వివరాలు.. లద్నాపూర్‌కు చెందిన నరేశ్ బుధవారం ఉదయం షిఫ్ట్‌లో తను నడిపే డంపర్ వాహనాన్ని పక్కన నిలిపి గడ్డిమందు తాగాడు. తోటి డ్రైవర్లు గమనించి సెంటినరికాలనీ డిస్పెన్సరీకి తరలించారు. అనంతరం గోదావరిఖని ఏరియా ఆస్పత్రి, అక్కడి నుంచి కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ఘటనకు సంబంధించి పని ఒత్తిడా? లేదా వ్యక్తిగత కారణాలా? తెలియాల్సి ఉంది.

• 15న ఉచిత వైద్యశిబిరం

పెద్దపల్లిరూరల్: జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో 15న పట్టణంలో నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జమాతే ఇస్లామి జిల్లా, పట్టణ అధ్యక్షులు అబ్దుల్ హైజావిద్ బుధవారం తెలిపారు. కరీంనగర్‌కు చెందిన ఫార్మ్యూన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పట్టణంలో ఫారాన్ కాంప్లెక్స్‌లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఉచిత వైద్యశిబిరం జరుగుతుందన్నారు. వైద్యశిబిరంలో ఎముకలు కీళ్ల సమస్యలు, శస్త్రచికిత్సలు, నోటి సంబంధిత చికిత్సలు, శిశువుల, పిల్లల, మహిళల ఆరోగ్యసేవలు, ఉచిత కంటి శస్త్రచికిత్సలు జరుగుతాయన్నారు. వివరాలకు 98496 07860 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన తెలిపారు.

• పశుగ్రాసం దగ్ధం

ఎలిగేడు: మండలంలోని శివపల్లిలో జక్కుల కొమురయ్యకు చెందిన పశువుల కొట్టం వద్ద పశుగ్రాసానికి మంగళవారం నిప్పంటుకుని పూర్తిగా కాలిపోయింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అటుగా వెళ్తున్న బాటసారులు చూసి గడ్డికుప్ప కాలుతున్న మంటలను చూసి డయల్ 100కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు.

• అర్హులు ఆందోళన చెందొద్దు

రామగుండం: ప్రజాపాలనలో భాగంగా గత నెల 21–24వ తేదీ వరకు జరిగిన సభల్లో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసిన లబ్ధిదారులు మళ్లీ మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని రామగుండం తహసీల్దార్ కుమారస్వామి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొంతమంది దళారులు రేషన్‌కార్డులు ఇప్పిస్తామని, ఇప్పటికే కార్డు కలిగిన ఉన్న వారిలో అదనంగా పేర్లను చేర్పిస్తామంటూ నమ్మబలికి డబ్బులు దండుకుంటున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. రేషన్‌కార్డుల జారీలో ప్రజాపాలన సభలు, ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను స్వయంగా తామే పరిశీలించి అర్హులకు నూతన రేషన్‌కార్డులు జారీ చేస్తామని పేర్కొన్నారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ఆయన సూచించారు.

• పోలింగ్‌బూత్‌లో పని చేసిన వారికి బిల్లులు చెల్లించండి

కోల్‌సిటీ: రామగుండం నియోజవర్గ పరిధిలో 2023 నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో, రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 206 పోలింగ్ బూత్‌లలో ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బందికి బిల్లులు చెల్లించాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్ డిమాండ్ చేశారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ స్టేషన్ల సౌకర్యార్థం కోసం టెండర్ల ద్వారా టెంట్ హౌస్ సామగ్రి, కిరాణ సామగ్రి, సౌండ్ బాక్స్, స్వీట్లు, స్వశక్తి మహిళా గ్రూపు సభ్యుల ద్వారా భోజనాలు చేయించడంతోపాటు తదితరులతో పనులు చేయించుకున్నారు. 15 నెలలు గడిచినా ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదని ఆరోపించారు. ఇప్పటికైనా బాధితులకు బిల్లులు చెల్లించాలని దినేశ్ డిమాండ్ చేశాడు.

• అర్చకుడిపై దాడిని ఖండిస్తున్నాం

జ్యోతినగర్: హైదరాబాద్ చిలుకూరు బాలాజీ దేవస్థానం ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ధూప దీప నైవేద్య అర్చక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఏటూరి శ్రావణ్ కుమారాచార్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, దాడికి పాల్పడ్డ వారిని వెంటనే అరెస్టు చేసి తగిన బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు.

• ఇంటర్ పరీక్షల కోసం ఏర్పాట్లు

సుల్తానాబాద్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పారిశుధ్య కార్మికులు శుభ్రం చేశారు. బుధవారం కళాశాల ఎదుట పరిసరాలను శుభ్రం చేశారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలతో పాటు ఫైనల్ పరీక్షల కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుభ్రం చేస్తున్నట్లు కార్మికులు తెలిపారు.

• అహల్యాబాయి త్రిశతాబ్ది ఉత్సవాల క్యాలెండర్ ఆవిష్కరణ

రామగుండం: మూడు శతాబ్దాల క్రితం దేశంలో హిందుత్వం కోసం ఉద్యమించిన ధీశాలి అహల్యాబాయి హోల్కర్‌ను ప్రతీ వనిత స్ఫూర్తిగా తీసుకోవాలని, ప్రస్తుతం మూడో శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో ఆమె చిత్రపటంతో నూతన సంవత్సర క్యాలెండర్లు ముద్రించారు. ఈ మేరకు బుధవారం అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట గ్రామ మార్నింగ్ వాకర్స్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొలిపాక మధుకర్‌రెడ్డి, పుట్ట శ్రీనివాస్, గంగారపు శ్రీనివాస్‌గౌడ్, తిరుపతిగౌడ్, కోల నారాయణ, అయిడపు మహిపాల్, అలిశెట్టి సూరజ్, కొలిపాక మనోహర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

యూరియా వినియోగంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏడీఏ అంజని

మంథని: మండలంలోని గోపాల్‌పూర్‌లో బుధవారం మంథని ఏడీఏ అంజని యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. డ్రోన్ వినియోగం ద్వారా రైతులకు సాగు ఖర్చు తగ్గుతుందని, దిగుబడి పెంచుకోవచ్చన్నారు. ఏవో నవ్య, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

ఖబ్రస్థాన్ శుభ్రం చేసి లైట్లు బిగించాలి

రామగుండం: పట్టణంలోని ముస్లిం శ్మశానవాటికను శుభ్రం చేయించి, అందులో లైట్లు ఏర్పాటు చేయాలని ఇన్‌చార్జి కమిషనర్ జె.అరుణశ్రీకి బుధవారం 50వ డివిజన్ కార్పొరేటర్ భర్త అహ్మద్‌బాబు వినతిపత్రం అందజేశారు. ఈనెల 13వ తేదీన జరిగే షబ్ ఏ బరాత్ పండుగను పురస్కరించుకొని కుటుంబ సభ్యుల సమాధుల వద్ద ప్రార్థనలు చేసి నివాళి అర్పిస్తారని తెలిపారు. పారిశుధ్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేయాలని వినతిపత్రంలో కోరినట్లు అహ్మద్‌బాబు పేర్కొన్నారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన చెప్పారు.

మున్నూరుకాపు కులగణన రీసర్వే చేయాలి

సుల్తానాబాద్: రాష్ట్రంలో మున్నూరుకాపు కులగణన రీసర్వే చేయాలని మున్నూరుకాపు సంక్షేమ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె దశరథం పటేల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ 2014 కుటుంబ సమగ్ర సర్వే ప్రకారం సుమారుగా 23 లక్షల మంది మున్నూరుకాపులు ఉన్నారని అప్పటి ప్రభుత్వం అంచనా వేసిందన్నారు. సగటున జనాభా లెక్కల ప్రకారం ఏటా ఒకశాతం జనాభా పెరుగుతూ వస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనలో మున్నూరుకాపులు 13 లక్షలు ఉన్నట్లు తక్కువ చేసి చూపించడం తీవ్ర అన్యాయమని వాపోయారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, అన్ని సంఘాల రాష్ట్ర అధ్యక్షులు ఒక తాటిపైకి వచ్చి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కోరారు. మున్నూరుకాపు యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి నిఖిల్, రాజేశ్ పటేల్, ప్రధాన కార్యదర్శి విజయ్, ఉపాధ్యక్షుడు అశోక్, అభిషేక్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన


నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పాత మడిపెల్లి గ్రామపంచాయతీ పరిధిలో అధికారులు బోగస్ ఓట్లు నమోదు చేశారని గ్రామస్తులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. బూత్ నంబర్ 131లో 30 మంది బోగస్ ఓటర్లను నమోదు చేశారని వారు ఆరోపించారు. వీరెవరికీ గ్రామంలో ఆధార్‌కార్డులు, నివాసాలు లేవని పేర్కొన్నారు. బోగస్ ఓట్లు నమోదు చేసిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ అడిగొప్పుల రాణిమోహన్ తహసీల్దార్ జగదీశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్‌కు, ఎలక్షన్ అధికారికి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు. సూత్రాల శ్రీనివాస్, ఫరీద్, పిట్టల శ్రీనివాస్, అజయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


కమాన్‌పూర్: మండలంలోని పెంచికల్‌పేట గ్రామ చౌరస్తా నుంచి సింగరేణి కోల్‌కారిడార్ వరకు ఉన్న రహదారి గుంతలుగా మారింది. దీంతో దారి వెంట ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కమాన్‌పూర్ మండల కేంద్రం నుంచి గోదావరిఖని, ఎఫ్‌సీఐ, ఎన్‌టీపీసీకి వెళ్లే ప్రధాన రహదారి ఇదే. రహదారి పూర్తిగా గుంతలుగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి ఎఫ్‌సీఐ వరకు డబుల్ రోడ్డు రహదారి ఏర్పాటు చేయిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయాలని ప్రజలు ఆరోపిస్తున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

సింగరేణి అధికారులకు పీఆర్పీ వెంటనే చెల్లించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి అధికారులకు వెంటనే పెర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే (పీఆర్పీ) చెల్లించాలని అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి పెద్ది నర్సింహులు, జాయింట్ సెక్రటరీ కిరణ్‌రాజ్‌కుమార్ కోరారు. సంస్థ సీఅండ్ఎండీ బలరాంను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. 2022–23 ఏడాది పీఆర్‌పీ చెల్లించాలని, నిర్మాణాత్మక సమావేశంలో ఒప్పుకున్న అంశాలను పరిష్కరించాలని విన్నవించారు. ఈ–8 ఇంటర్వ్యూలు వెంటనే నిర్వహించి త్వరితగతిన పదోన్నతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర‌రెడ్డి, కిరణ్‌కుమార్, జక్కారెడ్డి పాల్గొన్నారు. అనంతరం డైరెక్టర్‌గా నియామకమైన ఎల్‌వీ సూర్యనారాయణ, కొప్పుల వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు.

ఆర్జీ–1లో క్వార్టర్ల కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని క్వార్టర్ల కౌన్సెలింగ్ బుధవారం నిర్వహించారు. ఎస్‌సీ, ఏ, బీ, ఓల్డ్ బీ, సీ టైప్ క్వార్టర్లకు కౌన్సెలింగ్ ద్వారా క్వార్టర్లను కేటాయించారు. మొత్తం 30 క్వార్టర్లకు గాను 30 మంది అధికారులు దరఖాస్తు చేసుకోగా, అర్హత, సీనియార్టీని బట్టి క్వార్టర్లను కేటాయించినట్లు పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌లో ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సీనియర్ పీవో హనుమంతరావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారమే ధ్యేయం


మాట్లాడుతున్న సదానందం

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఆర్జీ–1 ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు సదానందం అన్నారు. ఏరియాలోని జీడీకే–1వ గనిలో బుధవారం జరిగిన బాయిబాట కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్మికులపై పనిభారం పెరుగుతోందని, డిప్యూటేషన్లు రద్దు చేసి పర్మినెంట్ పోస్టింగ్ ఇవ్వాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. నాయకులు సుంకరి నారాయణ, పోతరబోయిన సమ్మయ్య, గుండేటి శ్రీనివాస్, ఎల్.ఆంజనేయులు, కనకాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్చకుడిపై దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలి


నిరసన తెలుపుతున్న అర్చకులు

కమాన్‌పూర్: చిలుకూరి బాలాజీ ఆలయ అర్చకులు రంగరాజన్‌పై చేసిన దాడిని ఖండిస్తూ మండల కేంద్రంలో అర్చకులు బుధవారం బైక్ ర్యాలీ తీసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్చకుడిపై దాడి అంటేనే ఆలయంపై దాడి అని, సనాతన ధర్మం మీద దాడి చేసినట్లేనని, దీన్ని ప్రతీ హిందువు తీవ్రంగా ఖండించాలన్నారు. అర్చకుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ధూప దీప నైవేద్యం అర్చకుల మండల అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాసచారి, శేషం సురేశ్‌శర్మ, సతీశ్‌శర్మ, గడియారం వేణుమాధవ్, రామానుజం, రామాజనుచారి, మనోజ్‌శర్మ, వకులాభరణం శ్రీనివాసవర్మ, సముద్రాల వేణుచారి, హర్ష పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగ తొలగించండి



ఓదెల: మండలంలోని కొలనూర్ గ్రామశివారులోని రైతువేదిక వద్ద విద్యుత్ స్తంభానికి పచ్చనిచెట్టు తీగ అల్లుకోవడంతో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతోంది. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతువేదిక సమీపంలో ప్రధానరోడ్డు పక్కన విద్యుత్ కేవీలైనుకు చెట్టు తీగ అల్లుకోవడంతో తరచూ కరెంటు సరఫరా ట్రిప్ కావడంతో వ్యవసాయ పంపు మోటార్లు ఆగిపోతున్నాయి. తరచూ కరెంటు వస్తూ పోతుండటంతో కరెంటు మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విద్యుత్ స్తంభం నుంచి పెగడపల్లి, నాంసానిపల్లె, ఓదెల తండాకు విద్యుత్ సరఫరా అవుతుంది. చాలారోజుల నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.